క్లుప్తంగా

డీఎస్సీ మోడల్ టెస్టు



మోడల్ టెస్టు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి అధ్యక్షతన డీఎస్సీ విద్యార్థులకు మోడల్ టెస్టు నిర్వహించారు. నంద్యాల ఉప విద్యాశాఖ అధికారి డీటీ శంకర్‌ప్రసాద్, మహానంది ఎంఈఓ రామసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లెలో నిర్వహించిన మోడల్ టెస్టుకు 1500 మందికి పైగా డీఎస్సీ అభ్యర్థులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు భార్గవ రామయ్య, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణారావు, విజయరావు, శ్రీనివాసులు, నరసింహులు, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శివలింగానికి ప్రత్యేక పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఓ భక్తుడు స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా పుట్ట మన్ను తెప్పించి దాదాపు 70 మందితో చిన్న చిన్న శివలింగాలు తయారు చేయించారు. తర్వాత వాటన్నింటితో పెద్ద శివలింగాన్ని రూపొందించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు వీరికి ఆలయం వద్ద అన్నదాన వసతి కల్పించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



శిక్షణ కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న శ్రీ సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు నాట్య గురువు, చెస్ కోచ్, పల్లెంశెట్టి సురేష్ మాట్లాడుతూ గత నెల రోజులుగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో కూచిపూడి, చదరంగంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. తర్వాత శిక్షణలో పాల్గొన్న విద్యార్థులందరికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోవిందపల్లెలో కార్డెన్ సెర్చ్



బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

శిరివెళ్ల: మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన గోవిందపల్లెలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజామున సీఐ దస్తగిరి ఆధ్వర్యంలో సర్కిల్‌లోని ఎస్‌ఐలు, సిబ్బంది కలిసి టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుమానితులు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. సరైన రికార్డులు లేని 10 మోటార్ బైక్‌లు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. శాంతి భద్రతల కోసం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని సీఐ తెలిపారు.





మొదలైన రేషన్ కష్టాలు

నంద్యాల పట్టణంలో రేషన్ కోసం క్యూలో కార్డుదారులు, ఉయ్యాలవాడలో రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్న తహసీల్దార్

వైఎస్సార్‌సీపీ పాలనలో ఎలాంటి కష్టం లేకుండా ఇంటి వద్దే రేషన్ అందుకున్న పేదలకు మళ్లీ అవస్థలు మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం రేషన్ డోర్ డెలవరీ వ్యవస్థను రద్దు చేసి చౌకదుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి శ్రీకారం చుట్టడంతో నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని కార్డుదారులు చౌకదుకాణాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చింది. తొలి రోజే సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కొన్ని రేషన్ దుకాణాల వద్ద పెద్ద పెద్ద క్యూలు కనిపించాయి. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఈ వరుసలో నిలువలేక ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని చోట్ల చౌకదుకాణాలు ఇళ్లకు దూరంగా ఉండటంతో సరుకులు సంచుల్లో వేసుకుని ఇళ్లకు చేర్చుకునేందుకు అవస్థలు పడ్డారు.

– నంద్యాల అర్బన్/ఉయ్యాలవాడ

కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దాం



ఎర్రగుడిదిన్నెలో పార్టీశ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- 4న వెన్నుపోటు దినం భారీగా నిర్వహిద్దాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపు

రుద్రవరం: అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేసిన కూటమి సర్కారును నిలదీద్దామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు 2024 ఎన్నికల్లో భారీగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నెలో ఆదివారం ఆయన అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తో పాటు వివిధ పథకాలు అందిస్తామని గొప్పలు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిలో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే కూటమి ప్రభుత్వం మోసాలపై పోరాటాలకు సిద్ధమైనట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 4 వ తేది వెన్ను పోటు దినంగా ప్రకటించి నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు. ఆళ్లగడ్డలో నిర్వహించే ఈ నిరసన కార్యక్ర మాన్ని విజయవంతం చేసేందుకు పార్టీశ్రేణులు, ప్రజలు కదలి రావాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంగుల మనోహర్‌రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్ గంధం రాఘ వరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు ఎర్రం నర్సిరెడ్డి, ప్రసా దరెడ్డి, గంగిశెట్టి తిమ్మయ్య, వెంకటేష్, నరసింహయ్య, పుల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



నిరాహార దీక్ష చేపట్టిన రాష్ట్రీయ ధర్మరక్ష దళ్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): అధికారులు గో వధ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్రీయ ధర్మరక్షాదళ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ధర్మరక్షాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ నవీన్ గౌడ్, జిల్లా, గో రక్షక్ విభాగ్ జిల్లా ప్రముఖ్ రామ్ చరణ్ మాట్లాడుతూ గోవు హిందువుల ఆరాధ్య దైవమని చెప్పారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీక్షలో నాయకులు శివ, ప్రతాప్, సతీష్, కల్యాణ్ ఆచారి, నిఖిల్, మండ్ల గంగాధర్, ప్రసాద్ రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మన్యం గోపి, మోహన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు





ప్రతిభా పురస్కారాలతో బలిజ, కాపు విద్యార్థులు, పద్మశాలి విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): పదవ తరగతి, ఇంటర్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బలిజ, కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. రావూస్ మహిళ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దండె దస్తగిరి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా దాతల సహకారంతో చదువులో ప్రతిభ కనబరిచిన బలిజ, కాపు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొప్పుల సుబ్బారెడ్డి, శీను, కత్తి రాజశేఖర్, రవీంద్రనాథ్, ఆదినారాయణ, పసుపులేటి జనార్ధన్, ప్రసాద్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని భద్రావతి భావనారుషి కల్యాణ మండపంలో ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్‌లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు నగ దు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్‌యూ వీసీ వెంకట బసరావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, కొంకతి లక్ష్మీనారాయణ, గాజుల శంకర్, వెంకటరామయ్య, సూర్యానారాయణ, రామచంద్రుడు, చింతలపల్లె వాసు, చెన్నా వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ప్యాపిలి: ఎస్ రాచర్ల గ్రామంలో హనుమత్ సమేత సీతారామ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన శివరామకృష్ణ వృషభాలు విజేతగా నిలిచి రూ. 80 వేలు కైవసం చేసుకున్నాయి. కర్నూలు జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన మైమున్, గోపాల్‌గౌడ్ వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 60 వేలు గెలుపొందాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు తృతీయ స్థానంలో నిలిచి రూ. 40 వేలు, అనంతపురం జిల్లా యంగనపల్లెకు చెందిన ఇంద్రారెడ్డి, వాసుదేవరెడ్డి వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ. 30 వేలు చొప్పున గెలుపొందాయి. మొత్తం పది జతల వృషభాలు పోటీల్లో పాల్గొనగా అన్ని వృషభాలకు బహుమతులు అందజేశారు.

సైన్స్ ప్రచార సారథులు మౌనం వీడాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సైన్స్ ప్రచార రథ సారథులు మౌనం వీడాలని, శాస్త్రీయ విజ్ఞానం కలిగి చదువుకున్న వారు సైతం మౌనంగా ఉండటంతో అజ్ఞానులకు ఆయుధంగా మారిందని, ఇది సమాజానికి చెడు చేస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్ చెప్పారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వీబీఆర్ కాన్ఫరెన్స్ హాల్‌లో వేదిక కార్యకర్తల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సందర్భంగా బర్మా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదువుకున్న విజ్ఞానవంతులు కూడా సోషల్ మీడియాలో పుంఖానుపుంఖాలుగా ప్రచారంలోకి వస్తున్న అశాస్త్రీయ అంశాలను నిజమా? కాదా? అని పరిశీలించడం లేదని, అత్యధికులు మౌనంగా ఉడటం ద్వారా అవే వాస్తవ అంశాలుగా ప్రచారంలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సమాజానికి ఏ మాత్రం మంచి చేయదన్నారు. త్వరలో వైఎస్సార్ కడప జిల్లాలో జేవీవీ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని, నూతన కమిటీ ఎంపిక, విధి విధానాలపై చర్చ జరిగిందని, ప్రజాస్వామ్య విధంగా ఓటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. అన్ని జిల్లాల్లో జిల్లా మహాసభలను పూర్తి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వరాజ్యలక్ష్మి, కృష్ణాజీ, వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు సుజాత, మీన, శ్రీరాములు, వీరేష్, చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

4న మాన్యం భూముల కౌలు వేలం

శిరివెళ్ల: మండలంలోని గుండంపాడు, శిరివెళ్లలోని ఆలయాల మాన్యం భూముల కౌలు బహిరంగ వేలం పాట ఈ నెల4న నిర్వహించనున్నట్లు ఆలయాల ఈఓ రామాంజనేయ శర్మ ఆదివారం తెలిపారు. 2025–26 ఏడాదికి వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. పాటలలో పాల్గొన దలిచిన వారు రూ. 2 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

చాగలమర్రి: 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేయించుకుంటున్న నంద్యాల పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేటు కళాశాలలపై చర్యలు చేపట్టాలని టీఆర్‌వీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే తమ సిబ్బందితో గ్రామ గ్రామాన ప్రచారం మొదలు పెట్టారన్నారు. అడ్మిషన్ల కోసం పిల్లల తల్లిదండ్రులను మభ్యపెట్టి వేలాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు ఆయా విద్యా సంస్థలపై దృష్టి సారించి కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గురురాజలో అట్టహాసంగా సమ్మర్ క్యాంప్ వేడుకలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో ఉన్న శ్రీ గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురురాజ సమ్మర్ క్యాంప్ –2025 వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ షేక్షావలిరెడ్డి, దస్తగిరిరెడ్డి, మౌలాలిరెడ్డి మాట్లాడుతూ ఈ క్యాంపులో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు లలిత కళల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. చెస్, కరాటే, చిత్రలేఖనం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, శాస్త్రీయ, జానపద, ఆధునిక నృత్యం తదితర అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రశంసించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి బీమా సఖి

వెలుగోడు: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా బీమా సఖి పథకాన్ని ప్రవేశ పెట్టిందని, ఇందులో మహిళలు ఏజెంట్లుగా చేరే అవకాశం ఉందని సంస్థ ఆత్మకూరు బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎల్‌ఐసీ ప్రీమియం సెంటర్లో బీమా సఖి ఏజెంట్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పాసైన మహిళలు ఎల్‌ఐసీలో బీమా సఖి ఏజెంట్లుగా చేరితే మొదటి సంవత్సరం ప్రతినెల రూ.7వేలు, రెండో సంవత్సరం ప్రతినెల రూ.6వేలు, మూడో సంవత్సరం ప్రతి నెల రూ.5వేల ప్రకారం సంస్థ స్టయిఫండ్ చెల్లిస్తుందన్నారు. ప్రతి నెల రెండు పాలసీలు చేయిస్తే వాటి కమీషన్‌తో పాటు స్టయిఫండ్ పొందవచ్చని వివరించారు. ఉచితంగా గ్రూప్ ఇన్సూరెన్స్ కూ డా వర్తిస్తుందన్నారు. ఆవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఆత్మకూరు ఎల్‌ఐసీ బ్రాంచ్‌లో సంప్రదించాలని కోరారు.

వడుగుల కార్యక్రమం విజయవంతం

నంద్యాల(అర్బన్): ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల క్యాంపస్ స్కూల్‌లో నిర్వహించిన ఉచిత వడుగుల కార్యక్రమం విజయవంతమైంది. మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్ నిజామీ మాట్లాడుతూ 150 మంది చిన్నారులకు వడుగులు నిర్వహించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా సరఫరా చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లీ కౌన్సిల్ సేవలను మరింత విస్తరించనున్నామని చెప్పారు. అందుకు కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌస్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఫయాజ్, డాక్టర్ అబూబకర్ సిద్ధిఖీ, ముషారఫ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులు ఫుల్..వసతి గదులు నిల్!



మహానందీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- వసతిగృహాల కోసం భక్తుల అవస్థలు
- మూడింతలు అదనంగా వసూలు చేస్తున్న లాడ్జీల యజమానులు

మహానంది: వేసవి సెలవులతో మహానంది ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది. మహానందీశ్వర స్వామిని దర్శించుకుని భక్తులు అభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహించారు. ఇదిలా ఉండగా దేవస్థానానికి చెందిన వసతి గదులు తక్కువగా ఉండటంతో వసతి గృహాల కోసం భక్తులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. దేవస్థానం వసతి గృహాలు నిండిపోవడంతో ప్రైవేటు లాడ్జీల యజమానులు భక్తులను దోపిడీ చేస్తున్నారు. సాధారణ రోజుల కంటే మూడింతల మొత్తం అధికంగా వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. కొన్ని లాడ్జీల నిర్వాహకులు ఏకంగా మా లాడ్జీల్లో వసతి గృహాలు తీసుకుంటే దర్శనం ఉచితంగా చేయిస్తామంటూ భక్తులకు బంపర్ ఆఫర్ ఇస్తున్నట్లు సమాచారం. దీనికి ఆలయంలో పని చేసే కొందరు సిబ్బంది సహకరిస్తున్నట్లు సమాచారం. అధికారులు స్పందించి భక్తులకు అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ పీజీ కళాశాల ఆవరణలో ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ నిర్వహించారు. 9వ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ కర్నూలు ఆధ్వర్యంలో పది రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో డ్రిల్ పీటీ, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, గెస్ట్ లెక్చరర్స్, గేమ్స్, హెల్త్ అండ్ హైజిన్ తదితర వాటిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చినట్లు కర్నూలు కమాండెంట్ కల్నల్ జోబీపిలిప్ పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం గురించి రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి వివరించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో యోగా శిక్షణ డాక్టర్ లలితాసరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బోనాలు సమర్పిస్తున్న దృశ్యం

నంద్యాల (అర్బన్): గోస్పాడు మండలం కానాలపల్లె గ్రామంలో చౌడేశ్వరి దేవి జ్యోతుల మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. 15 సంవత్సరాల తర్వాత గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వేడుకల్లో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయాన్ని, చౌడేశ్వరి దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

విజేతలకు ట్రోఫీ, నగదు అందజేత



ట్రోఫీతో విజేత జట్టు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో శాంతిరాం ప్రీమియర్ లీగ్ టెన్నిస్‌బాల్ టోర్నీలో విజేతలుగా నిలిచిన ఆర్ఎస్ లెవెన్స్‌కు ట్రోఫీతో పాటు నగదు రూ.60 వేలు అందజేసినట్లు పోటీల నిర్వాహకులు మిద్దె రఘురాం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రఘురాం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఆర్ఎస్ లెవెన్స్, మనీ హైట్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్ఎస్ లెవెన్ టీం గెలుపొందినట్లు వెల్లడించారు.

బార్ అధ్యక్షుడికి సన్మానం



హుస్సేన్ బాషాను సన్మానిస్తున్న నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక క్రాంతి రేఖ గ్రంథాలయంలో నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్, మౌలానా అబ్దుల్లా రషాది, గౌరవ అధ్యక్షుడు ఎస్ఎండీ అబులైస్, అబ్దుల్ సమద్ ఆధ్వర్యంలో ఆదివారం నంద్యాల బార్ కౌన్సిల్ అధ్యక్షుడు హుస్సేన్ బాషాను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ హుసేన్ బాషా పట్టణంలో సీనియర్ న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవ న్యాయ సలహాదారుగా, నంద్యాల వక్ఫ్ బోర్డు సభ్యుడిగా సమాజానికి విలువైన సేవలు అందించారని కొనియాడారు. అనంతరం బార్ అసోసియన్ అధ్యక్షుడు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల ముస్లిం జేఏసీ సారథ్యంలో ఏర్పాటు చేసే లీగల్ సెల్‌కు తాను సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, బాబా ఫక్రుద్దీన్, ఎస్పీ బాషా, మజీద్, అయూబ్, కోహినూర్ మహబూబ్ బాషా, దాయి అలీ, మహబూబ్ కరీం, అసదుల్లా మియా, నయీమ్, గులాబ్, అష్రాఫ్, ఖలందర్, మౌలాన రఫీ సిరాజీ, హఫీజ్ ఇషాక్, హఫీజ్ అర్షద్, కుద్దుస్ అలిసార్ ఇమాములు, పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో భక్తుల సందడి



వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



కృష్ణానదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేమైన సప్తనది సంగమేశ్వరంలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు సందడి చేశారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో భక్తులు లలితా సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఎగువనుంచి శ్రీశైలం జలాశయానికి వరదనీరు ఎక్కువగా వస్తుంది. దీంతో దిగువ పుష్కరఘాట్‌ను కృష్ణాజలాలు తాకాయి. వచ్చిన భక్తులు ముందుగా ఆ జలాల్లో పుణ్యస్నానాలు చేసి, ఆలయ ఆవరణలోని దేవతా మూర్తులవద్ద కాయ కర్పూరం సమర్పించి, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా గర్భాలయంలోని వేపదారు శివలింగానికి కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, కృష్ణాజలాలతో అభిషేకం, మహా మంగళహారతి వంటి విశేషపూజా కార్యక్రమాలు చేసుకొని భక్తి పరావశ్యంతో పరవశించిపోయారు.